# నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 15 జనవరి 2024 | JAGTIAL


## సంబురాల సం'క్రాంతి'



సంబురాల సంక్రాంతి రానే వచ్చింది. మూడు రోజుల ముచ్చటైన వేడుక, ఆదివారం భోగితో మొదలు కాగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారు జామునే భోగి మంటలు వేశారు. అనంతరం పిల్లలకు తలస్నానం చేయించి, భోగిపండ్లను పోశారు. ఉదయాన మహిళలు వాకిళ్లను రంగురంగుల ముగ్గులతో నింపి, వాటి మధ్య ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచారు. వాటిపై గరక పోసలు ఉంచి, చుట్టూ నవధాన్యాలు, పండ్లు పోశారు. సూర్యుడు దక్షిణాయణం చాలించి, ఉత్తరాయణంలోకి ప్రవేశించే రోజే మకర సంక్రాంతి కాగా, పండుగను సోమవారం ఘనంగా జరుపుకొనేందుకు పల్లె, పట్నం సిద్ధమైంది.

-సారంగాపూర్, జనవరి 14

# సాగు పాఠం.. ఇక దృశ్యరూపకం

- వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా రైతువేదికలు
- సాగులో మరిన్ని మెళకువల కోసం సరికొత్త నిర్ణయం
- పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో నాలుగింటి ఎంపిక
- తిమ్మాపూర్, మల్యాల, సిరిసిల్ల, గుండారానికి అవకాశం
- పూర్తికావచ్చిన పరికరాల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ
- త్వరలోనే ప్రారంభించే అవకాశం
- ఆనందంలో రైతులు




**సేద్యంలో ఎలా ముందుకెళ్లాలి.. ఏ సీజన్‌లో ఏ పంట వేయాలి..? నష్టాలు ఎలా అధిగమించాలో సంపూర్ణ అవగాహన కోసం కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన రైతు వేదికలు సరికొత్తగా మారుతున్నాయి. ఇప్పటిదాకా కర్షకుల ముచ్చట్లకు కేంద్రాలుగా మారి, విజ్ఞానాన్ని పంచిన వేదికలు దృశ్యమాలికలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అన్నదాతలకు సాగులో మరిన్ని మెళకువలు, సాగులో సస్యరక్షణ చర్యల కోసం నేరుగా సంబంధిత శాస్త్రవేత్తలు, రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేస్తుండగా, పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో తిమ్మాపూర్, మల్యాల, సిరిసిల్ల, గుండారం వేదికలకు చాన్స్ దక్కింది. ఇప్పటికే ఆయా సెంటర్లలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ చివరి దశకు చేరగా, త్వరలోనే ప్రారంభించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.**

**- కరీంనగర్, జనవరి 14 (నమస్తే తెలంగాణ)**

రైతుల పక్షపాతిగా ముద్రపడిన కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయంలో అనేక సంస్కరణలు తెచ్చింది. రైతులు ఒక చోట సమావేశమై వారి సమస్యలను చర్చించుకుని అవగాహన పెంచుకునేందుకు, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, రాయితీలు వంటి ప్రయోజనాల గురించి సమగ్రంగా తెలుసుకునేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రతి 5వేల హెక్టార్లకు ఒక క్లస్టర్‌గా విభజించి దానికి ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించింది. వ్యవసాయ విస్తరణ అధికారి పర్యవేక్షణలోనే రైతు వేదికలు నిర్మించి, సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి వేదికలో రైతుల ప్రాతినిధ్యం ఉండేలా రైతుబంధు సమన్వయ సమితుల పేరిట రాజ్యాంగ బద్ధమైన కమిటీలను ఏర్పాటు చేసింది. అంతే కాకుండా రైతు వేదికలను రైతులు ఎంతోగొప్పగా వినియోగించుకునేలా ప్రోత్సహించింది.

### వీసీ కేంద్రాలుగా రైతు వేదికలు

కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన రైతు వేదికలను మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. అందులో భాగంగా కొన్నింటిలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నది. వాస్తవానికి కేసీఆర్ ప్రభుత్వంలోనే ఇలాంటి ఆలోచనలు జరిగాయి. క్లస్టర్ పరిధిలో రైతులు ఎలాంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి..? భూముల రకాలను బట్టి ఏ పంటలు వేస్తే లాభం జరుగుతుంది..? రైతు వేదికల పరిధిలో ఏ రోజు వాతావరణం.. ఎలా ఉంది..? అనే సమగ్రమైన వివరాలను ఇక్కడి నుంచే అందించాలని కేసీఆర్ సర్కారు ఆలోచనలు చేసింది. చివరికి రైతులు పండించిన ఉత్పత్తులకు ఆ సీజన్‌లో గిట్టుబాటు ధరలు రాకుంటే రైతు బంధు సమితుల ఆధ్వర్యంలో భద్రపర్చి డిమాండ్ ఏర్పడినపుడు విక్రయించుకునే పరిస్థితులు రైతులకు రావాలనే భావించింది. అయితే, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం రైతులకు వీడియో కాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. మొదట పైలెట్‌గా ప్రతి నియోజకవర్గానికి ఒక రైతు వేదికను తీర్చిదిద్దాలని భావించిన సర్కారు, ఇప్పుడు పైలెట్‌గా జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని తుది నిర్ణయం తీసుకుంది. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా వ్యవసాయ శాఖతోపాటు దానికి అనుబంధంగా ఉన్న ఉద్యాన, పట్టు, మల్బరీ, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటి పారుదల శాఖలకు సంబంధించిన సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తేబోతున్నట్లు తెలుస్తోంది.

### ఉమ్మడి జిల్లాలో నాలుగు వేదికలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతు వేదికల్లో నాలుగింటిని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఎంపిక చేశారు. కరీంనగర్ జిల్లాలో తిమ్మాపూర్, జగిత్యాల జిల్లాలో మల్యాల, పెద్దపల్లి జిల్లాలో గుండారం, సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రైతు వేదికల్లో సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే వీటిని ప్రారంభించే అవకాశాలున్నాయి. టీఎస్ స్వాన్ ద్వారా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా అధికారులు రైతులతో నేరుగా కాన్ఫరెన్స్ నిర్వహించుకునే అవకాశం ఏర్పడుతోంది. ఇప్పటి వరకు కేవలం జిల్లా, మండల స్థాయిలో సంబంధిత అధికారులతో హైదరాబాద్‌లోని కమిషనరేట్ స్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఇప్పుడు రైతులకు కూడా కలుగబోతున్నది.

### రైతులకు ఎంతో ప్రయోజనం..

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించడం వల్ల ఎన్నో ప్రయోనాలు ఉంటాయి. రైతులకు నిపుణులతో శిక్షణ కూడా ఇవ్వవచ్చు. సాగులో వచ్చే మార్పులు, ఆధునిక వ్యవసాయ విధానాలను ఎప్పటికపుడు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అందించే అవకాశం ఏర్పడుతుంది. రైతులు వ్యవసాయంపై మరింత అవగాహన పెంచుకుని సమయానుకూలంగా సస్యరక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జిల్లాకు ఒక రైతు వేదికను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇపుడు అదే పనిలో ఉన్నాం. అయితే వీటిని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించబోతున్నాం.

**- వాసిరెడ్డి శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి, కరీంనగర్**

## 'బండి' వ్యాఖ్యలు అర్థరహితం

- అయోధ్య రామాలయ ప్రారంభం ఎన్నికల స్టంట్ మాత్రమే
- దేవుడి పేరుతో రాజకీయ ప్రచారం
- మంత్రి పొన్నం వ్యాఖ్యలు



కరీంనగర్‌లో మీడియాతో చిట్‌చాట్ అనంతరం మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

కరీంనగర్ రాంనగర్/వేములవాడ టౌన్, డిసెంబర్ 14: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కూలగొడుతుందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌లో కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ అనంతరం మాట్లాడారు. అంతకు ముందు వేములవాడలో రాజన్నను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. తర్వాత విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముట్టుకునే ధైర్యం ఎవరూ చేయరని విషయాన్ని బండి సంజయ్ గుర్తించాలన్నారు. బండి వ్యాఖ్యలు జ్యోతిష్కుడి మాదిరిగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. అయోధ్య రామాలయం ప్రారంభం ఎన్నికల స్టంటేనని, జగద్గురువులు చెప్పినా గానీ అశాస్త్రీయంగా ఆలయ ప్రారంభోత్సవాన్ని చేయాలనుకోవడం సరికాదన్నారు. వైఫల్యం చెందిన ఎంపీలలో బండి సంజయ్ దేశంలోనే నంబర్ వన్ అని ఎద్దేవా చేశారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉంటే ఆరు గ్యారెంటీలతోపాటు పేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు కాంగ్రెస్ చేపడుతుందన్నారు. ఎవరు ఏం చెప్పినా ఆరు గ్యారెంటీల హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాముడి కటౌట్లు పెట్టుకొని బీజేపీ ఓట్లు అడిగేందుకు వస్తున్నదని మండిపడ్డారు.

### దేవుడి పేరుతో రాజకీయ ప్రచారం

దేవుడిని అడ్డం పెట్టుకొని కొందరు రాజకీయ ప్రచారం చేస్తున్నారని, ఈ విషయాన్ని తాము ప్రశ్నిస్తే హిందువులకు వ్యతిరేకమంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. శివరాత్రి కంటే ముందే ఆలయాభివృద్ధిపై వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. హిందూ సంస్కృతీ సంప్రదాయం ఉన్నవారు దేశాన్ని గౌరవిస్తారని, దేవుడు తమకే సొంతం అన్నట్లుగా కొందరి వ్యవహారం ఉందన్నారు. హిందూత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ ఈ విషయంపై ఆలోచన చేయాలని ఆయన కోరారు.

## సలహాలు ఇస్తే దూషిస్తరా?

- నన్ను వ్యక్తిగతంగా కెలకొద్దు
- మంత్రి పొన్నంకు ఎంపీ బండి సంజయ్ హితవు



మాట్లాడుతున్న కరీంనగర్ ఎంపీ సంజయ్

కరీంనగర్ విద్యానగర్, జనవరి 14 : కాంగ్రెస్‌కు నిర్మాణాత్మమైన సూచనలు, సలహాలు ఇస్తుంటే ఆ పార్టీ నాయకులు తనపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని తాను సూచిస్తే మంత్రి పొన్నం ప్రభాకర్ తనను వ్యక్తిగతంగా దూషించడం ఎంత వరకు సమంజసమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ వల్లనే కాంగ్రెస్ నాశనం అవుతుందని విమర్శించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంతోపాటు హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో జరిగిన వీరభద్ర స్వామి ఆలయం వద్ద మాట్లాడిన ఆయన పొన్నంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బీఆర్ఎస్ నాయకులపై మాట్లాడితే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎందుకు కోపం వస్తోందని ప్రశ్నించారు. తాము రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు పూర్తి స్థాయిలో సహకరిస్తామని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు కేంద్రంపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తనను వ్యక్తిగతంగా కెలకొద్దని, చిల్లర మాటలు మాట్లాడినా సంస్కారంతో వ్యవహరిస్తున్నానన్నారు. పొన్నం కరీంనగర్‌ను వదిలి హుస్నాబాద్ ఎందుకు పారిపోయాడో అందరికీ తెలుసన్నారు. రైతుబంధు అందక 48 లక్షల మంది రైతులు అల్లాడుతున్నారన్నారు. కేంద్రం సహాయం లేకుంటే రాష్ట్రంలో అప్పులెలా తీరుస్తారని ప్రశ్నించారు. రాహుల్ ప్రాపకం కోసమో, అధిష్టానం ఒత్తిడితోనో కాంగ్రెస్ నాయకులు బీజేపీపై విమర్శలు చేస్తే అది రాష్ట్రానికే నష్టమనే వాస్తవాన్ని గమనించాలని హితవు పలికారు. అయోధ్య రామమందిరం పూర్తికాకముందే పున: ప్రతిష్ట చేస్తున్నారనే ఆరోపణలపై స్పందించిన బండి సంజయ్ సాధు సంతువులు సూచించిన మంచి ముహూర్తం ప్రకారమే ఆలయ ప్రతిష్ట చేస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు రామ మందిర నిర్మాణానికి అనుకూలమా? వ్యతిరేకమా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడగానే ఈ దేశంలో విధ్వంసం జరగాలని కాంగ్రెస్ కోరుకున్నదని మండిపడ్డారు. అందరం కలిసి కేంద్రాన్ని ఒప్పించి అధిక నిధులు తీసుకొద్దామని కోరుకుంటున్నానని సూచించారు.



కొండగట్టు అంజన్న ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

## కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రముఖ ఆలయాల్లో గోదా రంగనాథుల కల్యాణం కమనీయంగా సాగింది. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి, కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంతోపాటు పలు ఆలయాల్లో కనుల పండువలా నిర్వహించారు. అర్చకులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తీసుకువచ్చి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో గోదారంగనాథుల ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రోచ్ఛారణల మధ్య కల్యాణాన్ని జరిపించారు.

- మల్యాల, జనవరి 14

## చైనా మాంజాపై నిషేధం

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 14: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో చైనా మాంజాపై నిషేధం ఉన్నట్లు కమిషనర్ రెమో రాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైనా మాంజాను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పతంగులు ఎగురవేసే క్రమంలో ఎన్నో పక్షులు, సాధారణ ప్రజలు, గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా ప్రమాదానికి గురవుతున్న నేపథ్యంలో చైనా మాంజాపై ప్రభుత్వం నిషేధం విధించినట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకా రం చైనా మాంజాను అమ్మితే ఏడేళ్ల జైలు, రూ. 10వేల జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు..









## అందుబాటులోకి కోనేరు



ఓదెల మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు కోనేరు అందుబాటులోకి వచ్చింది. ఇన్నాళ్లూ స్వామివారి దర్శనానికి ముందు పుణ్యస్నానాలు ఆచరించేందుకు సరైన వసతి లేక ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం కోనేరు అందుబాటులోకి రావడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆలయ పాలకవర్గ సభ్యులు ఆదివారం కోనేరును పరిశీలించారు. స్నానపు గదులు, ఆలయ అర్ధ మండపం, మండపం మరమ్మతులు, సులభ్ కాంప్లెక్స్ ఏర్పాట్లపై చర్చించారు. - ఓదెల, జనవరి 14

## ఉమ్మడి జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు

కమాన్‌చౌరస్తా, జనవరి 14: తెలంగాణ ఆర్ట్ వర్క్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(టీపీవేటా) ఆధ్వర్యంలో అయోధ్య రాముడిపై చిత్రలేఖ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు తాడూరి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు జూనియర్స్ విభాగం, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సీనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. రాముడు, సీతారామలక్ష్మణ సమేత హనుమాన్, ప్రతిష్ఠించబోయే శ్రీరాములవారి పాదుకల చిత్రం, వీటిలో ఏదైనా ఒక అంశాన్ని ఏ-4 సైజు పేపర్‌లో చిత్రీకరించి రంగులు వేయాలని చెప్పారు. ఆ చిత్రాలను ఈనెల 20లోగా టీపీవేటా ఉమ్మడి జిల్లా కార్యాలయం, ఇంటి నెంబర్ 2-7-146, కళాభారతి ఎదురుగా, బస్టాండ్ పక్కన, కరీంనగర్ 505001 అడ్రస్‌కు పంపాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849302904 నంబర్‌లో సంప్రదించాలన్నారు.




















